రేపు కమిషనర్‌తో ఫోన్ ఇన్



మరిపెడ : సాక్షి ఆధ్వర్యంలో రేపు(శనివారం) మరిపెడ మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డితో 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం, డంపింగ్‌యార్డు, పార్కులు, కోతులబెడద తదితర సమస్యలపై ఫోన్ చేసి కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

తేదీ: 29-03-2025, శనివారం
ఫోన్ చేయాల్సిన నంబర్:
9573160839
సమయం ఉదయం 11 గంటల నుంచి
12 గంటల వరకు

సర్టిఫికెట్ల జారీలో జాప్యం!

- రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గార్ల : మండల కేంద్రానికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం కోసం కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం యువకులు ఇబ్బదులు పడుతున్నారు. గార్ల మండలానికి డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణిని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కలెక్టర్ నియమించారు. దీంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ గార్లకు రెండ్రోజులకు ఒకసారి వస్తుండటంతో సర్టిఫికెట్ల జారీకోసం ప్రజలు రోజుల తరబడి తిరుగుతూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాజీవ్ యువ వికాస పథకం సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి నిత్యం 50 నుంచి 100 మంది వరకు యువకులు వస్తున్నారు. అదే విధంగా భూములు రిజిస్ట్రేషన్ల



గార్ల తహసీల్దార్ కార్యాలయం

కోసం వచ్చిన రైతులు సైతం కార్యాలయం ఎదుట చెట్ల కింద గంటల కొద్ది వేచి చూస్తు ఇబ్బందులు పడుతున్నారు. గుడుంబా విక్రయించినా, కొనుగోలు చేసిన వారిని ఎక్సైజ్‌శాఖ పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తారు. దీంతో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ఎక్సైజ్‌శాఖ పోలీసులకు ఇబ్బందిగా మారింది. రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని వివిధ పార్టీల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు నిర్వహించినా ఫలితం లేదు.

తహసీల్దార్‌ను నియమించాలి



రాజీవ్ యువ వికాస పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే కులం, ఆదాయం సర్టిఫికెట్లు కావాలి. ఆ సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వస్తే రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యం అవుతుంది. జిల్లా కలెక్టర్ వెంటనే గార్ల మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

- జి.సక్రు, గార్ల

ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే గార్లకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు డిమాండ్ చేశారు.

రైల్వే ఆయిల్ ట్యాంకర్ల పరిశీలన



ట్యాంకర్లను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

మహబూబాబాద్ రూరల్ : ఆయిల్ ట్యాంకర్లతో వెళ్తున్న ఓ రైలు బోగీ పైభాగంలో మంటలు వస్తున్నాయని సమాచారం రాగా అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గురువారం విజయవాడ వైపు నుంచి కాజీపేటకు ఆయిల్ ట్యాంకర్లతో వెళ్తున్న ఓ రైలు మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగింది. బోగీ పైభాగంలో పొగలు వస్తున్నాయని గమనించిన స్థానిక పాయింట్స్ మెన్ వెంటనే రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వగా వారు విషయాన్ని అగ్నిమాపక అధికారులకు తెలియజేశారు. రైల్వే రక్షక దళ అధికారులు, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా ఎలాంటి పొగలు, మంటలు కనిపించకపోవడంతో పరిశీలించి ఎలాంటి ప్రమాదంలేదని నిర్ధయించి వెళ్లిపోయారు.

నేటినుంచి కొండలమ్మ జాతర





కొండలమ్మ మూలవిరాట్, జాతరకు ముస్తాబైన కొండలమ్మ దేవాలయం

గార్ల : మండలంలోని పినిరెడ్డిగూడెం సమీపంలో గల కొండలమ్మ దేవాలయంలో నేటినుంచి మూడ్రోజుల పాటు జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. కాకతీయుల ఆరాధ్య దేవత కొండలమ్మ పేరుతో ఆలయాన్ని పిలుస్తారు. భక్తుల కొంగుబంగారమైన కొండలమ్మ తల్లి తమ కోరికలను తీర్చే అమ్మగా భక్తులు కొలుస్తుంటారు. కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే కొండలమ్మ దేవాలయంలో ప్రతి ఏటా ఉగాది పండుగ సందర్భంగా జాతర నిర్వహిస్తారు.నేడు ప్రభల ఊరేగింపు, 29న పూర్ణ కుంభంతో దేవతారాధన, 30న నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతరకు గార్ల మండలంతో పాటు సమీపంలోని బయ్యారం, కారేపల్లి, డోర్నకల్ మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

లక్ష్మక్క జాతరను విజయవంతం చేయాలి

గూడూరు : మండలంలోని గుండెంగ శివారు గుడి తండాలో జరిగే హచ్చుమా బాయి (లక్ష్మక్క), దస్రు సాద్, బుడియాబాపు జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ధరంసోత్ కిషన్ నాయక్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ వేడుకను ఎమ్మెల్యే మురళీనాయక్, తహశీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వీరస్వామి శనివారం ప్రారంభిస్తారన్నారు.

క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ల ఎన్నికల్లో సుభాష్ ఘన విజయం



మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్ల ఎన్నికలు గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ప్రశాంతంగా జరిగాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా పోటీలో ఉన్న అభ్యర్థులు తోట సుభాష్‌కు ఏనుగు, నీలం రమేష్‌కు ఇల్లు గుర్తును కేటాయించారు.18 మండలాలకు చెందిన 780 ఫొటోగ్రాఫర్ల ఓట్లు ఉండగా, 630 ఓట్లు పోలయ్యాయి. అందులో తోట సుభాష్‌కు 390, నీలం రమేష్‌కు 262 ఓట్లు వచ్చాయి.128 ఓట్లతో జిల్లా అధ్యక్షుడిగా తోట సుభాష్ గెలుపొందడంతో సంబురాలు చేసుకున్నారు.

ఆర్థికసాయం



మరిపెడ రూరల్ (చిన్నగూడూరు) : చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన వనపర్తి నాగమణి క్యాన్సర్‌తో ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు గాడిపెల్లి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం రూ.32 వేలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో చేపల వేట ప్రాణాంతకం



వేలాడుతున్న వైర్లను చూపిస్తున్న డీఈ విజయ్

కురవి : విద్యుత్‌తో చేపల వేట ప్రాణాంతకమని మహబూబాబాద్ విద్యుత్ శాఖ డీఈ విజయ్ అన్నారు. గురువారం సీరోలు మండలం తునికి చెట్టు తండాలో ఇటీవల చేపల వేటకు వెళ్లి మరణించిన బానోత్ పవన్ తండ్రి శ్రీనివాస్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఫ్యాన్‌కు విద్యుత్ వైర్లు ఉండడాన్ని ఆయన పరిశీలించారు. ఏఈడీ రమేష్, ఏఈ సునీల్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మీసాల వెంకన్న గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముదారి బుచ్చయ్య , పుణ్యపుర్తి మహేష్, పచ్చిపాల కృష్ణ పాల్గొన్నారు.

గూడూరు : మండలంలోని లైన్‌తండాలో గురువారం ఈజీఎస్ ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ ప్రారంభించారు. కన్నబోయిన వెంకన్న, మండల మల్లేష్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం



వంట పాత్రలు అందజేస్తున్న ఎంఈఓ రవికుమార్



సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

మహబూబాబాద్ అర్బన్ : ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ఎంఈఓ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ బడులకు మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఉపాధ్యాయులకు అందజేశారు.

వంట పాత్రల పంపిణీ

గూడూరు : మధ్యాహ్న భోజన వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ జి. రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం పీఎం పోషణ పథకంలో భాగంగా 46 పాఠశాలలకు మంజూరైన మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఆయన వంట కార్మికులకు అందజేశారు.

భూ సర్వే పరిశీలన

కేసముద్రం: మండలంలోని నారాయణపురం గ్రామంలో చేపట్టిన భూ సర్వేను అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి గురువారం పరిశీలించారు. ఇప్పటికే నారాయణపురం గ్రామంలో హద్దులను నిర్ణయించి ప్రత్యేక బృందం సర్వే చేస్తోంది. ఈ క్రమంలో అదనపు కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి ఇప్పటి వరకు చేపట్టిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధికారులకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ దామోదర్, డీఐలు, ఏడీలు, సర్వేయర్‌లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

'క్రైస్తవులకు రక్షణ కరువు'



నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు, దైవ సేవకులు

తొర్రూరు : క్రైస్తవులకు రక్షణ కరువైందని తొర్రూరు డివిజన్ పాస్టర్లు నిరీక్షణరావు, కృష్ణమోహన్‌లు అభిప్రాయపడ్డారు. క్రీస్తు సందేశకుడు పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిని నిరసిస్తూ గురువారం డివిజన్ కేంద్రంలో పాస్టర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...క్రీస్తు సందేశాన్ని ప్రజలకు అందించే ప్రవీణ్ అనుమానాస్పద మృతి బాధాకరమన్నారు. పాస్టర్లు జాన్సన్, అబ్రహం, రాజేంద్రప్రసాద్, దైవ సేవకులు పాల్గొన్నారు.

రక్తదానం

నెహ్రూసెంటర్ : సినీనటుడు రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రామ్‌చరణ్, చిరు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అభిమానులు రక్తదానం చేశారు.రామ్ చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి రావీష్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి మునీర్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



పట్టుబడిన గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

మహబూబాబాద్ రూరల్ : గుడుంబా నిర్మూలనలో భాగంగా కురవి మండలంలోని బలపాల, లింగ్య తండా, జగ్య తండా, మహబూబాబాద్ మండలంలోని భజన తండాలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీంలు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి గురువారం తెలిపారు. 31 లీటర్ల గుడుంబా, 60 కిలోల బెల్లం, 20 కిలోల పటికను సీజ్ చేసి 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారన్నారు. బానోత్ చిలకమ్మ, భూక్య అచ్చమ్మ, బానోత్ భద్ర, మాలోత్ కవిత, జాటోతు హరికిషన్, బానోతు రాందాస్, లూనావత్ వెంకన్న, భూక్య వెంకన్న 8 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి, వారిని సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సైలు చంద్రశేఖర్, మౌనిక, అశోక్, కిరీటి, హెడ్ కానిస్టేబుళ్లు మధు, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు యాదగిరి, రాజు, శేఖర్, వెంకన్న, నర్సింగరావు, వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ఇంటిస్థలంపై ఇరువర్గాల ఘర్షణ



తండాలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై సంతోష్

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం లూనావత్ తండాలో ఇంటి స్థలంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఖాళీగా ఉన్న ఇంటిస్థలాన్ని ఓ వర్గం వారు చదును చేసి కంచె ఏర్పాటు చేశారు. దీంతో మరోవర్గం వారు కంచెను ధ్వంసం చేసి స్తంభాలను విరగొట్టారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య దాడులు చోటు చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న మరిపెడ ఎస్సై సంతోష్ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి ఇరువర్గాలను సముదాయించి శాంతింపజేశారు. ఈ స్థలం కోర్టు పరిధిలో ఉందని, కోర్టు తీర్పు వచ్చేంత వరకు స్థలం వద్దకు ఎవరూ కూడా వెళ్లొద్దని సూచించారు. కంచెను ధ్వంసం చేయడంతో పాటు దాడికి పాల్పడి గాయపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని లూనావత్ సక్రు, బుజ్జి, భద్రు, సునీత, యాకూబ్, ఉమాపతి, భిక్షం, ఈరి, మురళికృష్ణ, సంతోష్ అన్నారు. ఈ మేరకు ధ్వంసం చేసి కంచెను చూపిస్తు నిరసన వ్యక్తం చేశారు.

కారు ఢీకొని రైతుకు తీవ్రగాయాలు

కురవి : పొలం వద్దకు వెళ్తున్న రైతును కారు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడినట్లు బాధితుడి సోదరుడు ఉపేందర్ గురువారం తెలిపారు. మండలంలోని బలపాల గ్రామానికి చెందిన రైతు పొన్నం నాగేశ్వర్‌రావు పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. గొల్లచర్ల నుంచి మహబూబాబాద్‌కు అతివేగంతో వచ్చిన కారు నాగేశ్వర్‌రావును ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. గాయపడిన నాగేశ్వర్‌రావును స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికలో చేర్పించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు పొన్నం ఉపేందర్ గురువారం కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై సతీష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై సతీష్ పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి..

దంతాలపల్లి : బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన దూలం నరేష్ సొంత పనిపై దంతాలపల్లికి వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో మండలకేంద్రం శివారులో బైకు అదుపుతప్పి పడిపోయాడు. దీంతో నరేష్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

కార్మికవర్గ పార్టీలు అధికారంలో ఉంటేనే మేలు



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: దేశంలో కార్మికవర్గ పార్టీలు అధికారంలోకి వస్తేనే అన్ని రంగాల కార్మికులకు మేలు జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీర భవన్‌లో గురువారం సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోకార్పొరేట్ పాలన పోయి కార్మిక వర్గాలు అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న మోదీ పాలన పోవాలంటే కార్మిక వర్గం ఐకమత్యంతో గద్దె దించాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని, సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను ఆదుకునేందుకు కొత్త పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో రేషపల్లి నవీన్, మంద శంకర్, చిర్ర లక్ష్మీనర్సమ్మ, ఎల్లారీశ్వరి బైసాస్వామి, వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, రాంబాబు, రమణ, వెంకటకృష్ణ, జగన్, సౌమ్యశ్రీ, చింతల ఉపేందర్, రాములు, కొమ్ము యాకయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆఫీసర్ పోస్టు భర్తీ చేయాలి



జిల్లా జడ్జి రవీంద్రశర్మకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

తొర్రూరు: తొర్రూరు కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆఫీసర్ పోస్టు భర్తీ చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం స్థానిక జూనియర్ సివిల్‌కోర్టును ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రవీంద్రశర్మ సందర్శించారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పోస్టుపై బార్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా జడ్జికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు జడ్జి మట్ట సరిత, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్కే ఘనపురం, సైదులు, మైలపాక అశోక్, ప్రవీణ్, కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలి

బయ్యారం/కొత్తగూడ : ఏజెన్సీవాసులు సేకరించే 50ఆకుల తునికాకు కట్టకు రూ.6 చెల్లించాలని భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, మల్లేశ్, సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ జిల్లా నాయకుడు కొత్తపల్లి రవి గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్ జిల్లాల ఏజెన్సీవాసులకు తునికాకు సేకరణ యాసంగి పంటగా కొనసాగుతుందఇ వారు పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చాలి

కేసముద్రం : హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య డిమాండ్ చేశారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో మాట్లాడారు. మండల కార్యదర్శి మరిపెల్లి మొగిలి, కందుకూరి రమేష్, ఉల్లి ప్రతాప్, సదానందం, మహబూబ్, రాజేశ్వర్‌రావు, లింబానాయక్, కట్టయ్య పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కురవి : సీరోలు మండలం కొత్తూరు(సీ)లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బయ్యారం : వ్యవసాయ పరికరాల కోసం మహిళా రైతులు తమ కార్యాలయంలో నేడు (శుక్రవారం) వరకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంజీ గురువారం సూచించారు.

పనులు పూర్తి చేయాలి

కేసముద్రం : అండర్ డ్రెయినేజీ వద్ద పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం రైల్వే అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.నాయకులు చాగంటి కిషన్, జల్లే జయరాజ్, వేల్పుగొండ సావిత్ర, గుగులోత్ కేశ్యానాయక్, సోమారపు ఎల్లయ్య, బొల్లెద్దు పూలమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ విచారణ

డోర్నకల్ : మండలంలోని తొడేళ్లగూడెం అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు పంపిణీ చేశారనే అభియోగంపై గురువారం సీడీపీఓ లక్ష్మి విచారణ చేపట్టారు.

బోరుబావి నీటిపై..

కొత్తగూడ : ఓటాయి శ్మశాన వాటిక బోరు నీటిని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించిన సంఘటనపై జిల్లా పంచాయతీ అధికారి ఆదేశానుసారం ఎంపీఓ రామకృష్ణ గురువారం విచారణ చేపట్టారు. గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకున్న ఎంపీఓ ఉన్నతాధికారులకు నివేదిస్తానని అన్నారు.

విద్యారంగ సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యేలు

మహబూబాబాద్ అర్బన్ : మానుకోటకు చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్య లపై కనీసం మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గంధసిరి జ్యోతిబస్సు, పట్ల మధు గురువారం విమర్శించారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు అవగాహన

డోర్నకల్ : సహజ పానీయాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కోవిలాల రాజేశ్వర్ తెలిపారు. మండలంలోని కన్నెగుండ్ల జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

'ప్రపంచ సుందరి పోటీలు నిలిపి వేయాలి'

కొత్తగూడ : ప్రపంచ సుందరి పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం కార్యకర్తలు తహసీల్దార్ రమాదేవికి గురువారంవినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు చిన్నం లక్ష్మి మాట్లాడుతూ మహిళల్లో అశ్లీలతను పెంపొందించే అందాల పోటీలను నిర్వహించడం సరికాదన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దంతాలపల్లి : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాబు మనోహర్, ప్రధానకార్యదర్శిగా నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నిక

నెల్లికుదురు : బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడుగా మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన గడ్డల రాము, అదే గ్రామానికి చెందిన గజ్జి అశోక్‌ను గ్రామశాఖ అధ్యక్షుడుగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు పి.వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు.

'మంత్రిపదవి ఇవ్వాలి'

మహబూబాబాద్ రూరల్ /నెహ్రూసెంటర్ : మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌కు మంత్రిపదవి రావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, రాష్ట్ర బీసీ నేత శంతన్ రామరాజు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ గుడిలో గురువారం 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.అలాగే మహబూబాబాద్, డోర్నకల్ లంబాడీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ గురువారం అన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

గూడూరు/మహబూబాబాద్ రూరల్/ కేసముద్రం: సమస్యలు పరిష్కరించాలని చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గూడూరులో మాజీ సర్పంచ్‌లు నూనావత్ రమేష్‌నాయక్, గుగులోతు బాలు, మంగీలాల్, విష్ణు, ధనంసోతు బాలును, మహబూబాబాద్‌లో జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్‌జీ, మాజీ సర్పంచ్‌లు సంద వీరన్న, భూక్య వస్రాం, సుమన్, మహమ్మద్ షఫియుద్దీన్, ఆంగోత్ కాంతి, భూక్యా సింధు, మేడి శారదను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు రికవరీ

నర్సింహులపేట : మండల కేంద్రానికి చెందిన ఎస్‌బీఐ మినీ బ్యాంక్ నిర్వాహకుడు గుగులోత్ రమేష్ నుంచి సైబర్ నేరగాళ్లు కాజేసిన రూ.80 వేలు రికవరీ చేసినట్లు ఎస్సై మాలోత్ సురేష్ తెలిపారు. సైబర్ నేరగాళ్లు డబ్బులను క్రాస్ చేయడంతో బాధితుడు 1930 ఫిర్యాదు చేశాడు. నిందితుల ఖాతాను నిలిపి వేసి గురువారం డబ్బులను రికవరీ చేసి రమేష్‌కు నగదు అప్పగించిట్లు పేర్కొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

దంతాలపల్లి : పోషకాహారం తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని దాట్ల, దంతాలపల్లి ఉన్నత పాఠశాలలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పోషణ మేళా కార్యక్రమం నిర్వహించారు.

బస్సుకు హాల్టింగ్ కల్పించాలి

బయ్యారం : గోదావరిఖని నుంచి భద్రాచలం వెళ్లే సూపర్‌లగ్జరి బస్సుకు బయ్యారంలో హాల్టింగ్ కల్పించాలని జర్నలిస్టులు, స్థానికులు గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

పనులు ప్రారంభం

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం చిల్లంచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ నూర్జహాన్ సత్తార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మురారి యాదగిరి గురువారం ప్రారంభించారు.

చదువులో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్ : విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ మాజీ లీడర్ బి.అజయసారథిరెడ్డి అన్నారు. గురువారం నవోదయ ప్రవేశ ఫలితాల్లో సీటు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు.

వసతులు కల్పించాలి

తొర్రూరు రూరల్ : ఉపాధి కూలీలకు తగిన వసతులు కల్పించాలని సీపీఐ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చీకటాయపాలెంలో కొనసాగుతున్న ఉపాధి పనులను వారు పరిశీలించారు.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక ఉపయోగకరం'

కురవి/గూడూరు : ఒకే దేశం–ఒకే ఎన్నిక ఎంతగానో ఉపయోగపడుతుందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్ శర్మ, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పాదిల నర్సింహారెడ్డి గురువారం పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని టీపీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ నేత అప్పారి వెంకటస్వామి వర్ధంతిని గురువారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుల..

నెహ్రూసెంటర్ : భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదంశెట్టి నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్యభవన్‌లో కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నెల్లికుదురు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న అన్నారు. కేజీబీవీ, ఆదర్శపాఠశాల, సాంఘిక సంక్షేమ పాఠశాలలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ బాలరాజుతో కలసి గురువారం సందర్శించి పరిశీలించారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్‌లో వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్ ధ్వంసం చేసిన ఘటనలో పన్నాల గిరిప్రసాద్ పై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక గురువారం తెలిపారు.

ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

డోర్నకల్ : మహిళలు నైపుణ్య శిక్షణ పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సీఐ బి.రాజేష్ కోరారు. కల్వరీ పీస్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో 45 రోజుల పాటు ఉచిత మగ్గం శిక్షణ పొందిన మహిళలకు గురువారం సీఐ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు : లంబాడీ హక్కుల సాధనకై ఉద్యమించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నంగారా భేరి లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో మానుకోట కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉద్యోగికి విరమణ సహజం

పెద్దవంగర /తొర్రూరు రూరల్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని డీపీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. పద్మమ్మ పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. అలాగే తొర్రూరు మండలంలోని అరిపిరాల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన చంద్రప్రకాశ్‌గౌడ్, శోభారాణి దంపతులను ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, గ్రామస్తులు, యువకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.